ప్రజాశక్తి
బుధవారం 22 ఫిబ్రవరి 2023 5
పార్వతీపురం మన్యం

5లోగా ఇ - క్రాప్ నమోదు పూర్తి : కలెక్టర్

ప్రజాశక్తి - కలెక్టరేట్

ఇ– క్రాప్ నమోదు ఈనెల 25లోగా పూర్తికావాలని కలెక్టర్ నిశాంత్ కుమార్ అధికారులను ఆదేశించారు. స్థానిక కలెక్టర్ కార్యాలయం నుంచి వ్యవసాయ అనుబంధ రంగాల ప్రగతిపై మండల స్థాయి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇ క్రాప్ నమోదు ఈనెల 25లోగా పక్కాగా పూర్తి చేయాలని, పంట నమోదులో తప్పులున్న పక్షంలో సంబంధిత గ్రామ వ్యవసాయ సహాయకులపై చర్యలు తీసుకుంటామని అన్నారు. రైతుల ఉత్పాదక సామర్థ్యం, ఆర్థికాభివృద్ధి సాధించాలన్న లక్ష్యంతో అమలు చేస్తున్న పథకాలపై దృష్టి సారించాలని అన్నారు. జీడి పంటపై గ్రామాల్లో తోటబడి నిర్వహించి రైతులకు అవగాహన, మెళకువలు అందించాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా రైతు శిక్షణా కేంద్రం ప్రిన్సిపల్ శారద, జిల్లా పశుసంవర్ధక అధికారి డాక్టర్ ఆరిక ఈశ్వరరావు, జిల్లా ఉద్యాన శాఖ అధికారి కె.ఎస్.ఎన్.రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

మెడికల్ కళాశాల నిర్మాణ పనులను పరిశీలిస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు (ఫైల్)

జిల్లావాసుల చిరకాల వాంఛ నెరవేరనుంది. ప్రభుత్వ మెడికల్ కళాశాలలో తరగతుల నిర్వహణకు ఎట్టకేలకు అనుమతులు లభించాయి. వైద్యసేవలతోపాటు తరగతులు కూడా అందుబాటులోకి రానుండడంతో అటు విద్యార్థులకు, ఇటు ప్రజలకు మరింత ఊరట లభించనుంది. మెడికల్ కాలేజి తరగతులను వచ్చే విద్యాసంవత్సరం నుంచి ప్రారంభించేందుకు జాతీయ వైద్యమండలి (ఎన్ఎంసి) ఈనెల 20న ఉత్తర్వులు జారీచేసింది. 150 ఎంబిబిఎస్ సీట్లు మంజూరు చేసినట్లు అందులో పేర్కొంది. రాష్ట్రంలో మంజూరు చేసిన 16 వైద్య కళాశాలలకు గాను ఒక్క విజయనగరం కళాశాలలోనే తరగతులు ప్రారంభం కానుండడం గమనార్హం.

నెరవేరిన చిరకాల వాంఛ

- మెడికల్ కళాశాలకు అనుమతులు
- వచ్చే ఏడాది నుంచి 150 సీట్లతో తరగతుల నిర్వహణకు గ్రీన్ సిగ్నల్
- రూ.8.6కోట్లతో సర్వజన ఆస్పత్రిలో సదుపాయాలు

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

ఉమ్మడి రాష్ట్రంలో ప్రభుత్వ మెడికల్ కళాశాల లేని ఏకైక జిల్లా విజయనగరం. దీంతో, విజయనగరంలో మెడికల్ కాలేజీ ఏర్పాటు చేయాలని దశాబ్దాల తరబడి పోరాటం నడిచింది. చివరకు రాష్ట్ర విభజన అనంతరం టిడిపి ప్రభుత్వం విజయనగరంలో మెడికల్ కాలేజీ ఏర్పాటు చేస్తామని ప్రకటించింది. కానీ, అప్పట్లో జిల్లాలో అన్నీ తానై వ్యవహరించిన టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు పూసపాటి అశోక్ గజపతిరాజు ప్రైవేటు రంగంలో ఏర్పాటు చేసేందుకు ప్రయత్నించారు. కేంద్ర మంత్రిగా తనకున్న పలుకుబడిని ఉపయోగించి, జేబు సంస్థగా మార్చేసుకున్న మాన్సాస్ ఆధ్వర్యాన ఏర్పాటు చేసేందుకు పావులు కదిపారు. ఈ పేరుతో ఛైర్మన్‌గా తనకున్న అధికారాన్ని ఉపయోగించి మాన్సాస్‌లో రూ.వందల కోట్ల విలువగలిగి స్థలాలు విక్రయానికి పెట్టారు. చివరకు ప్రభుత్వం దిగిపోయే ముందు తాము కళాశాలను నిర్వహించలేమంటూ చేతులు ఎత్తేశారు.

అనంతరం అధికారంలోకి వచ్చిన వైసిపి ప్రభుత్వం జిల్లాల పునర్విభజన తరువాత విజయనగరంతో పాటు 16జిల్లాల్లో ప్రభుత్వ వైద్య కళాశాలలు ఏర్పాటు చేస్తామని ప్రకటించింది. ఇందుకోసం గాజులరేగకు సమీపంలోగల 80ఎకరాల స్థలాన్ని సేకరించి నిర్మాణ పనులు చేపట్టారు. ఇందుకు రూ.500 కోట్ల నాబార్డు నిధులు మంజూరయ్యాయి. యుద్ధ ప్రాతిపదికన నిర్మాణ పనులు జరుగుతున్నాయి. తాత్కాలిక భవనాలు కొలిక్కివచ్చాయి. మరోవైపు జిల్లా కేంద్రాసుపత్రిని మెడికల్ కాలేజీకి అనుసంధానం చేశారు. ఇక్కడి వైద్య విధాన పరిషత్ వైద్యులను సిహెచ్‌లకు తరలించి, ఇక్కడ అవసరమైన భోదనా వైద్యులతోపాటు సిబ్బంది నియామకాలు చేపట్టారు. ఈనెల 3న విద్యాప్రమాణాలు, వైద్య సదుపాయాలు, సిబ్బంది నియామకం తదితర అంశాలను పరిశీలించేందుకు వచ్చిన ఎంఎంసి బృందం సంతృప్తి వ్యక్తం చేసింది. ఈనేపథ్యంలో 2023–24 విద్యాసంవత్సరంలో ఎంబిబిఎస్ తరగతుల నిర్వహణకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. రాష్ట్రంలో మంజూరైన 16 వైద్య కళాశాలల్లో తరగతులు ప్రారంభమవుతున్న తొలి కళాశాల ఇదే కావడం గమనార్హం.

శరవేగంగా ప్రభుత్వ వైద్య కళాశాల

గాజులరేగ వద్ద చేపట్టిన వైద్య కళాశాల శాశ్వత భవనాల నిర్మాణాలు శరవేగంగా ముందుకు సాగుతున్నాయి. రోజుకు 200 మంది నిపుణులు నిర్మాణ పనుల్లో నిమగ్నమయ్యారు. సుమారు రూ.35 కోట్లతో, పివిబి స్ట్రక్చర్ విధానంలో, వైద్య కళాశాల తరగతుల భవనాన్ని త్వరలో ప్రారంభించేందుకు సిద్ధం చేస్తున్నారు. ఇక్కడే ఎంబిబిఎస్ మొదటి సంవత్సర తరగతులను వచ్చే ఏడాది నుంచి నిర్వహించనున్నారు.

సర్వజన ఆసుపత్రిలో సౌకర్యాలు

ప్రభుత్వ వైద్య కళాశాలను తాత్కాలికంగా ప్రారంభించేందుకు, జిల్లా సర్వజన ఆసుపత్రిలో ఇప్పటికే ఏర్పాట్లు పూర్తి చేశారు. దీంతో, ఆసుపత్రి రూపురేఖలు మారాయి. ఆధునిక వసతులను కల్పించారు. ఆసుపత్రి పరిశరాలను సుందరంగా తీర్చిదిద్దారు. పూర్తిస్థాయిలో సిబ్బందిని నియమించారు. సుమారు 8.6 కోట్ల రూపాయల ఖర్చుతో అవసరమైన భవనాలను నిర్మించి, వసతులను ఏర్పాటు చేశారు. ఔట్ పేషెంట్ రిజిస్ట్రేషన్ రూమ్, లెక్చర్ గ్యాలరీని నిర్మించారు. మొత్తం 30 పడకలతో ఎన్ఐసియు, ఐసియు, ఎస్ఐసియు సదుపాయాలను ఏర్పాటు చేశారు. అత్యాధునిక ఆపరేషన్ థియేటర్‌ను ఇప్పటికే అందుబాటులోకి తెచ్చారు. గర్భిణులు, చిన్నపిల్లల కోసం ఘోషా ఆసుపత్రిని అభివృద్ధి చేశారు. వైద్య కళాశాల ఏర్పాటు కోసం మౌలిక వసతులను కల్పించడమే కాకుండా, దీనికి అవసరమైన ప్రిన్సిపాల్, ప్రొఫెసర్లు, వైద్య నిపుణులు, ఇతర సిబ్బంది నియామకాలను కూడా దాదాపు పూర్తి చేశారు.

రాష్ట్ర జాతరగా పోలమాంబ పండగ

- ఆలయ అభివృద్ధి దిశగా అడుగులు
- దేవాదాయశాఖ ప్రాంతీయ సంయుక్త కమిషనర్ సురేష్ బాబు

ప్రజాశక్తి- మక్కువ

శంబరలోని పోలమాంబ చదురుగుడి

ఉత్తరాంధ్రుల ఆరాధ్య దేవతగా, గిరిజన జాతరగా వెలుగొందుతున్న పోలమాంబ అమ్మవారి జాతరకు రాష్ట్రస్థాయి గుర్తింపు లభించిందని దేవాదాయ శాఖ ప్రాంతీయ సంయుక్త కమిషనర్ ఎంవి సురేష్ బాబు వెల్లడించారు మంగళవారం ఐదో జాతర సందర్భంగా ఆయన పోలమాంబ అమ్మవారిని దర్శించుకున్నారు ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రస్థాయి గిరిజన జాతరగా గుర్తించిన జరిగిన నేపథ్యంలో సందర్శించడానికి వచ్చానని ఆయన తెలిపారు. చదురు గుడిఆలయ అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికలు తయారు చేయాలని ట్రస్ట్ బోర్డ్ చైర్మన్ దాలినాయుడుకు ఆయన సూచించారు. అనవసరంగా జరుగుతున్న ఖర్చులను తగ్గించుకొని ఆలయానికి వచ్చే ఆదాయం పెంపుదలకు ప్రత్యేక ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామన్నారు. ఆ దిశగా అడుగులు వేసేలా ఇఒ రాధాకృష్ణకు పలు సూచనలు చేశారు

శాశ్వత క్యూలైన్ల ఏర్పాటుకు ఆదేశాలు

పోలమాంబ జాతరకు ఇకపై దేవాదాయ శాఖ శాశ్వతంగా క్యూలైన్లు ఏర్పాటు చేసేలా దానికి తగిన అంచనాలను వెంటనే తయారు చేయాలని స్థానిక దేవాదాయశాఖ కార్యాలయం నుంచే అధికారులకు ఫోన్ ద్వారా ఆదేశాలు జారీ చేశారు. అమ్మవారి సేవలో ఉండే వారికి గౌరవ వేతనాలను వెంటనే విడుదల చేసేందుకు ఆదేశాలు జారీ చేశారు. ఇప్పటివరకు పోలమాంబ సన్నిధిలో సేవ చేసుకునే పూజరులకు ప్రాంతీయ సంయుక్త కమిషనర్ సురేష్ బాబు శుభవార్త అందించారు. వంశపారంపర్యంగా వచ్చే పూజారులను (ఆశాదీలు) త్వరలో శాశ్వత నియామకం చేపడతామని ఆయన భరోసా ఇచ్చారు. ఆ దిశగా సంబంధిత అధికారులకు నివేదిక అందజేయాలని ఇఒకు సూచించారు. ఇప్పటివరకు అమ్మవారి సేవలో పాల్గొన్న విశ్రాంతి ఉద్యోగులకు ఇవ్వవలసిన గౌరవ వేతనాలు కూడా వెంటనే మంజూరు చేస్తున్నట్లు ఆయన తెలిపారు

శాశ్వత దుకాణాలకు ఏర్పాట్లు

పోలమాంబ జాతర రాష్ట్ర స్థాయి జాతరగా గుర్తింపు పొందడంతో జాతరకు వచ్చే భక్తులకు సౌకర్యార్థం ప్రత్యేక దుకాణాలను పక్కాగా ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. పోలమాంబ ఆలయ అభివృద్ధికి జిల్లాస్థాయి ప్రత్యేక కమిటీ చేస్తామన్నారు. ఆలయ అభివృద్ధికి సంబంధించిన భూమి కొనుగోలు ఇతర అంశాలపై నిర్ణయం తీసుకుంటామన్నారు.

స్పందన, సుస్థిర అభివృద్ధి లక్ష్యాలపై నేడు వర్క్‌షాపు

ప్రజాశక్తి-విజయనగరం

ప్రజావినతుల కార్యక్రమం స్పందన, సుస్థిర అభివృద్ధి లక్ష్యాల సాధన అంశాలపై విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల జిల్లా, మండల స్థాయి అధికారులకు బుధవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు కలెక్టరేట్ ఆడిటోరియంలో ఓరియంటేషన్ వర్క్ షాపు నిర్వహిస్తున్నట్టు జిల్లా కలెక్టర్ ఎ.సూర్యకుమారి తెలిపారు. స్పందనలో వచ్చే వినతుల ఆయా అర్జీదారులు సంతృప్తి చెందేలా ఎలా పరిష్కరించాలి వంటి అంశాలపై రాష్ట్ర స్థాయి అధికారులు అవగాహన కల్పిస్తారని కలెక్టర్ తెలిపారు. సుస్థిర అభివృద్ధి లక్ష్యాల ప్రాధాన్యత వాటిని సాధించే విధానంపై కూడా అవగాహన కలిగిస్తారని పేర్కొన్నారు. ప్రణాళిక శాఖ ఆధ్వర్యంలో నిర్వహించనున్న ఈ వర్క్ షాపులో ప్రణాళిక, పురపాలక, విద్యా, మహిళాశిశు సంక్షేమం, వైద్య ఆరోగ్య శాఖ, గ్రామ వార్డు సచివాలయ శాఖల రాష్ట్ర స్థాయి అధికారులు పాల్గొంటారని తెలిపారు. ఆడిటోరియంలో జరుగుతుందన్నారు.

సభలో మాట్లాడుతున్న కవి గంటేడ గౌరునాయుడు

చరిత్ర గతిని మార్చిన 'మహాప్రస్థానం'

ప్రజాశక్తి -కలెక్టరేట్

అభ్యుదయ కవి శ్రీశ్రీ రచించిన మహాప్రస్థానం చరిత్ర గతికి మార్చిందని ప్రముఖ కవి గంట్యాడ గౌరినాయుడు అన్నారు. మంగళవారం స్థానిక సుందరయ్య భవనంలో ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఐద్వా జిల్లా కార్యదర్శి రెడ్డి శ్రీదేవి అధ్యక్షతన రెడ్ బుక్ డే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా పాల్గొన్న గౌరినాయుడు మాట్లాడుతూ శ్రీశ్రీ మహాప్రస్థానం కవితల పఠనం ఏ కాలానికైనా వర్తింపజేసే శ్రమ విలువను పెంచే విప్లవాత్మకమైన గొప్ప రచనలు అన్నారు. మహాప్రస్థానంలో రచనలు సమాజానికి ఎంతో ఉపయోగపడతాయన్నారు. ఈనెల 21న మాతృభాష దినోత్సవం మని ఇదే రోజు వామపక్ష, ప్రజా సంఘాలు రెడ్ బుక్ డే దినం పాటించి మహాప్రస్థానంపై పుస్తక పఠనం చేయడం మహా అద్భుతం అన్నారు. ఏ కాలానికి చెందిన మనిషిలోనైనా చైతన్యాన్ని రగిలించి నిద్రపోతున్న సమాజాన్ని మేల్కొల్పడమే మహాప్రస్థానం గొప్పతనం అన్నారు. మహాప్రస్థానం యువత అధ్యయనం చేయడం నవ సమాజ నిర్మాణానికి దోహదపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు, శ్రామిక మహిళా సంఘం, సిఐటియు, ఎస్ఎఫ్ఐ మధ్యాహ్న భోజనం తదితర ప్రజాసంఘాల నాయకులు పాల్గొన్నారు.

పాలకొండ రూరల్: సమాజ మార్పుకు శ్రీశ్రీ రచనలు ఎంతో ఉపయోగకరమని సిపిఎం మండల కన్వీనర్ దావాల రమణారావు అన్నారు. రెడ్ బుక్స్ డే సందర్భంగా సిపిఎం ఆధ్వర్యంలో పాలకొండలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీశ్రీ రచనలు, కవితలు సమాజ మార్పునకు ఉపయోగపడే అనేక అంశాల్ని మహాప్రస్థానం పుస్తకం చదువుదాం సమాజాన్ని మార్చుకుందాం అని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిపిఎం మండల నాయకులు అర్థముడి లక్ష్మణరావు, కె.రాము తదతరులు పాల్గొన్నారు.

కొమరాడ : రెడ్ బుక్స్ డే సిఐటియు ఆధ్వర్యంలో కొమరాడలో నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీశ్రీ రచించిన మహాప్రస్థానం సోషలిజం ప్రాధాన్యతను తెలియజేసిందని సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు కొల్లి సాంబమూర్తి, ఎపి రైతు సంఘం నాయకులు ఎ.ఉపేంద్ర, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు రెడ్డి శివ నాయుడు అన్నారు.

మే నాటికి వంద మొబైల్ టవర్లు

ప్రజాశక్తి - కలెక్టరేట్

జిల్లాలో వచ్చే మే నాటికి వంద మొబైల్ టవర్లు పూర్తి చేయాలని కలెక్టర్ నిశాంత్ కుమార్ ఆదేశించారు. జిల్లాలో మొబైల్ టవర్ల నిర్మాణంపై జిల్లా కలెక్టర్ కార్యాలయంలో మంగళవారం మొబైల్ ఆపరేటర్లతో జిల్లా కలెక్టర్ సమీక్షించారు. 179 ప్రదేశాల్లో స్థలాలను ఇప్పటికే కేటాయించినట్లు ఆయన పేర్కొన్నారు. మొబైల్ ఆపరేటర్లు తమ పనుల ప్రగతిని వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఫిబ్రవరి చివరి నాటికి దాదాపు 25 వరకు పూర్తవుతున్నాయని, వాటన్నింటినీ వెంటనే ఆపరేషన్‌లోకి తీసుకురావాలని పేర్కొన్నారు. మార్చి, ఏప్రిల్ నెలల్లో కనీసం మరో 30చొప్పున పూర్తిచేసి మే నాటికి వంద టవర్లు ఆపరేషన్‌లోకి తీసుకురావాలని స్పష్టం చేశారు. అటవీ ప్రాంతంలో ఉన్న స్థలాలపై జిల్లా కమిటీ దృష్టికి తీసుకెళ్లి వెంటనే సమస్య పరిష్కారం చేసుకోవాలని సూచించారు. రిజర్వ్ అటవీ ప్రాంతంలో ఉన్న స్థలాల్లో త్వరగా పరిష్కరించేందుకు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. సమావేశంలో జెసి ఓ.ఆనంద్, ఐటిడిఎ పిఒ సి.విష్ణు చరణ్, డిఆర్ఒ జె.వెంకటరావు, పాలకొండ సబ్ కలెక్టర్ నూరుల్ కమర్, ఆర్‌డిఒ కె.హేమలత, ఎయిర్ టెల్, బిఎస్ఎన్ఎల్, జియో ప్రతినిధులు పాల్గొన్నారు.

విద్యార్థులతో మాట్లాడుతున్న పోస్ట్‌మాస్టర్ జనరల్ రాములు

ప్రతి ఇంటికీ పోస్టల్ సేవలు

ప్రజాశక్తి - సీతంపేట

ప్రతి ఇంటికి పోస్టల్ సేవలు అందించాలని విశాఖపట్నం రీజినల్ పోస్ట్‌మాస్టర్ జనరల్ కె.రాములు అన్నారు. సోమ, మంగళవారం సీతంపేట ఏజెన్సీల పర్యటించారు. తొలుత ఆయన మండలంలోని నాయుడు, మల్లి ప్రతిభ కళాశాలలను సోమవారం రాత్రి సందర్శించారు. విద్యార్థుల భవిష్యత్తు కెరీర్ గురించి సూచనలు, సలహాలు ఇచ్చారు. విద్యార్థులకు పోటీ పరీక్షలు గురించి అవగాహన కల్పించారు. విద్యార్థులు ప్రణాళిక ప్రకారం చదువుకుంటే లక్ష్యాలు చేరుకుంటారని అన్నారు. అనంతరం పెదరామ పోస్టల్ కార్యాలయాన్ని సందర్శించి గ్రామస్తులతో మాట్లాడారు. పోస్టల్ సర్వీసులు ఇంటింటికి అందిస్తామని తెలిపారు. ప్రతి మారుమూల పోస్టల్ సర్వీసు సేవలందించాలని సిబ్బందికి సూచించారు. పోస్టల్ బీమా పథకం బీమా దాచుకున్న డబ్బులు పొదుపు ఇంట్రెస్ట్ గురించి అవగాహన కల్పించాలన్నారు. ఆయనతో పాటు ఒఎస్‌డి ఎం.యుగంధర్, పోస్‌మాస్టర్, మహేష్ గుప్త, పోస్ట్‌మేన్ అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

పరీక్ష ఏర్పాట్లను కలెక్టర్ వివరిస్తున్న ఆర్ఐఒ సత్యనారాయణ

ఇంటర్ పరీక్షల నిర్వహణకు ఏర్పాట్లు

ప్రజాశక్తి - కలెక్టరేట్

ఇంటర్ పబ్లిక్ పరీక్షల నిర్వహణకు కావాల్సిన ఏర్పాట్లు పూర్తిచేయాలని జిల్లా కలెక్టరు నిశాంత్ కుమార్ అధికారులను ఆదేశించారు. పరీక్షల నిర్వహణకు ముందస్తు ఏర్పాట్లలో భాగంగా మంగళవారం కలెక్టరు అధ్యక్షతన స్థానిక కలెక్టరేట్‌లో జిల్లా స్థాయి హైపవర్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పరీక్షల నిర్వహణలో భాగమైన వివిధ శాఖల ముందస్తు ఏర్పాట్లపై జిల్లా కలెక్టరు సమీక్ష నిర్వహించారు. పరీక్షా కేంద్రాల్లో మౌళిక సదుపాయాలు ఏర్పాటు చేయాలన్నారు. విద్యార్థుల సౌకర్యార్థం బస్సులు నడపాలని, ప్రజారవాణాశాఖ అధికారులకు కలెక్టరు ఆదేశాలు జారీచేశారు. రైల్వే గేట్లు గల గ్రామాల నుంచి విద్యార్థులు ముందుగానే బయలుదేరేలా చూడాలని తెలిపారు. పరీక్షలు జరుగు రోజుల్లో ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు విద్యుత్ అంతరాయం లేకుండా చూడాలన్నారు. పరీక్షా కేంద్రాల్లో మంచినీరు ఏర్పాటు చేయాలని తెలిపారు. వైద్య ఆరోగ్య శాఖ పరీక్షా కేంద్రాల్లో మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేయాలన్నారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షను అమలు చేయాలని, ఎస్కార్ట్, పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలని పోలీసు అధికారులకు తెలిపారు. పరీక్షల నిర్వహణ అనంతరం జవాబు పత్రాల బండిల్స్ సకాలంలో పంపించేందుకు పరీక్షల నిర్వహణ అధికారులకు పోస్టలు సిబ్బంది సహకరించాలని తెలిపారు. ఇంటర్మీడియట్ బోర్డు ప్రాంతీయ తనిఖీ అధికారి ఎం.సత్యనారాయణ పరీక్షల ఏర్పాట్ల గూర్చి తెలియజేస్తూ జిల్లాలో 31 పరీక్షా కేంద్రాలు, 10 స్టోరేజి పాయింట్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ నెల 20 నుంచి ప్రాక్టికల్ పరీక్షలు ప్రారంభమయ్యాయని మార్చి 7 వరకు జరుగుతాయని, మార్చి 15 నుంచి ఏప్రిల్ 4 వరకు రాతపరీక్షలు నిర్వహించనున్నటు తెలిపారు. మొదటి సంవత్సరం 11,318 మంది విద్యార్థులు, రెండో సంవత్సరం 10,945 మంది విద్యార్థులు కలిపి 22,263 మంది పరీక్షలకు హాజరవుతున్నారని తెలిపారు. సమావేశంలో డిఎస్‌పి ఎస్.సుభాష్, డిఐఇఒ డి.మంజులవీణ, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

పిడిఎఫ్ అభ్యర్థి రమాప్రభను గెలిపించాలి

ప్రజాశక్తి - కొమరాడ

ఉత్తరాంధ్ర పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న కె.రమాప్రభను గెలిపించాలని సిఐటియు నాయకులు కొల్లి సాంబమూర్తి కోరారు. మంగళవారం స్థానిక ఎపి బాలుర రెసిడెన్షియల్ పాఠశాలలో, జిల్లా పరిషత్ హై స్కూల్, కొటిపాం పాఠశాలలో ప్రచారం నిర్వహించారు. మార్చి 13న జరగనున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో తన ఓటును రామాప్రభకు వేసి గెలిపించాలని కోరారు. ఉత్తరాంధ్ర అభివృద్ధికి పాటుపడుతున్న రమాప్రభను గెలిపిస్తే ఈ ప్రాంతం అభివృద్ధికి కృషి చేస్తారని అన్నారు.

గుమ్మలక్ష్మీపురం: మండలంలోని మారుమూల ప్రాంతమైన బీరుపాడు గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో ఎమ్మెల్సీ కోరెడ్ల రమాప్రభకు మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలని కోరుతూ ప్రచారం చేశారు. మొదటి ప్రాధాన్యత ఓటును రమాప్రభకు వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్.మన్మథరావు, గిరిజన సంఘ మండల కార్యదర్శి పువ్వల తిరుపతిరావు, గిరిజన సంఘం నాయకులు పువ్వల సోమేశ్వరరావు ఉన్నారు.

పాలకొండ రూరల్: ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ పిడిఎఫ్ అభ్యర్థి డాక్టర్ కోరెడ్ల రమాప్రభను గెలిపించాలని ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక ప్రజా సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో పాలకొండ పట్టణంలో మంగళవారం ఇంటింటా ప్రచారం నిర్వహించారు. సిఐటియు జిల్లా అధ్యక్షులు దావాల రమణారావు, జెవివి జిల్లా కార్యదర్శి ,ఎస్.ఉమా మహేష్ తదితరులు మాట్లాడుతూ ఉత్తరాంధ్రకు ప్రత్యేక ప్యాకేజీ అమలు కోసం విశాఖ స్టీల్ ప్లాంట్ కాపాడుకోవ డానికి, సిపిఎస్ రద్దు, కాంటాక్ట్ ఔట్సోర్సింగ్ ఉద్యోగులు రెగ్యులరైజేషన్, ప్రైవేటు విద్యాసంస్థల ఉద్యోగ, ఉపాధ్యాయులకు వెల్ఫేర్ బోర్డు ఏర్పాట ుతో పాటు ఉత్తరాంధ్ర ఉద్యమాలను బలపర్చేం దుకు, ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక పెన్షనర్ల తదితర రంగాల సమస్యలు పరిష్కారానికి కృషి చేసే అభ్యర్థిని గెలిపించాలని, గ్రాడ్యుయేషన్ ఓటర్లకు మీ కుటుంబ సభ్యులకు, స్నేహితులకు తెలియజేసి కోరడ్ల రమాప్రభకు మొదటి ప్రాధాన్య త ఓటు వేసి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు.

కనీస వేతనాలు వచ్చేలా పనిచేయాలి

డ్వామా పీడీ

ప్రజాశక్తి - కొమరాడ

గ్రామాల్లో పనిచేస్తున్న ఉపాధి వేతనదారులకు కనీస వేతనాలు వచ్చేలా పనులు చేయాలని డ్వామా ప్రాజెక్టు డైరెక్టర్ కె.రామచంద్రరావు అన్నారు. మంగళవారం రాజ్యలక్ష్మి పురం సమీపంలో ఉన్న జంఝావతి కాలువలో చేస్తున్న ఉపాధి హామీ పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా పనులు చేస్తున్న ప్రదేశాన్ని పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఉపాధి హామీ వేతనదారులకు కనీస వేతనాలు వచ్చేలా పనిచేసే సిబ్బంది అవగాహన కల్పించాలన్నారు. ప్రతి వేతనదారుడు తమకు ఇచ్చిన కొలతల ప్రకారం పని చేస్తే కనీస వేతనాలు రూ.250 చొప్పున వస్తాయన్నారు. అలాగే ఉపాధివేతన ధరలు చేస్తున్న పనులకు ఎప్పటికప్పుడు అధికారుల పర్యవేక్షణ చేసి పలు సూచనలు, సలహాలు అందజేయాలన్నారు. ఈయనతో పాటు ఎపిఒ బాలకృష్ణ, ఇసి సోమేశ్వరరావు ఉన్నారు.

సమావేశానికి మక్కువ నాయకుల డుమ్మా

ఎంఎల్‌సి పదవి ఇవ్వలేదని అసంతృప్తితో గైర్హాజరు

ప్రజాశక్తి-సాలూరు

వైసిపి పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి గెలుపు కోసం అనుసరించాల్సిన వ్యూహంపై చర్చించేందుకు మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశానికి మక్కువ మండలం అధికారపార్టీ నాయకులు డుమ్మా కొట్టారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో అభ్యర్థుల విజయానికి కృషి చేయాలని ఆదేశిస్తూ సిఎం జగన్ మోహన్ రెడ్డి ఎమ్మెల్యేలు, మంత్రులపై బాధ్యతలు పెట్టినట్లు తెలుస్తోంది. దీనిలో భాగంగా డిప్యూటీ సిఎం రాజన్నదొర మంగళవారం మక్కువ, సాలూరు పట్టణ నాయకులతో సమావేశం ఏర్పాటు చేస్తూ సమాచారం పంపించారు. అయితే మంగళవారం సాయంత్రం డిప్యూటీ సీఎం రాజన్నదొర నివాసంలో జరిగిన ఈ సమావేశానికి మక్కువ మండలం నాయకులు హాజరు కాలేదు. మున్సిపాలిటీ వైసిపి నాయకులు, కౌన్సిలర్ లు మాత్రమే హాజరయ్యారు. వచ్చేనెలలో జరగనున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో అభ్యర్థిని గెలిపించడానికి స్థానిక నాయకులు ఏ విధంగా పని చేయాలనే దానిపై డిప్యూటి సిఎం రాజన్నదొర అవగాహన కల్పించారు. కానీ మక్కువ మండలం నాయకులు హాజరు కాకపోవడం పార్టీ శ్రేణుల్లో చర్చనీయాంశమైంది.

ఎమ్మెల్సీల ప్రకటనతో ఖంగుతిన్న మావుడి కుటుంబం

వైసిపి మక్కువ మండలం నాయకులు ఎమ్మెల్సీ ఎన్నికల కీలక సమావేశానికి గైర్హాజరు కావడం వెనుక రకరకాల ఊహాగానాలు వినిపిస్తున్నాయి. గత కొంతకాలంగా నియోజకవర్గంలో పార్టీకి వెన్నుదన్నుగా ఉన్న మండలం నాయకులు తమకు నామినేటెడ్ ఎమ్మెల్సీ పదవి కావాలని కోరుతున్నారు. సీనియర్ నాయకులు మావుడి శ్రీనివాసరావు నాయుడు, రంగునాయుడు నాయకత్వంలో పార్టీ మండలంలో శత్రుదుర్భేధ్యంగా ఉంది. కాంగ్రెస్ ప్రభుత్వం హయాం నుంచి నేటి వైసిపి వరకు మావుడి కుటుంబీకులు ఎమ్మెల్యే రాజన్నదొర వెంటనే ఉన్నారు. ఇటీవల కాలంలో వారు తమ మనసులోని మాటను డిప్యూటీ సిఎం రాజన్నదొర ద్వారా సిఎం జగన్ మోహన్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. సోమవారం అధిష్టానం 18మంది ఎమ్మెల్సీలకు అభ్యర్థులను ప్రకటించింది. వీరిలో మన్యం జిల్లా నుంచి ఆశించిన మావుడి కుటుంబీకుల పేరు లేదు. దీంతో వారు తీవ్ర అసంతృప్తితో రగిలిపోతున్నారనే వాదనలు వినిపిస్తున్నాయి. గతంలో ఎఎంసి చైర్మన్ పదవిని కూడా వారు కాదనుకుని సాలూరు మండలం నాయకులు దండి శ్రీనివాసరావు భార్య అనంతకుమారికి సిఫార్సు చేశారు. ఈ నేపథ్యంలోనే వారు కీలక సమావేశానికి హాజరు కాలేదనే ప్రచారం జరుగుతోంది.

కెజిబివిలో ఆహారాన్ని పరిశీలిస్తున్న కేసలి అప్పారావు

సమస్యలుంటే నిర్భయంగా తెలపండి

పాచిపెంట : విద్యార్థులకు ఎటువంటి సమస్యలున్నా నిర్భయంగా చెప్పాలని చైల్డ్ రైట్స్ కమిషన్ చైర్మన్ డాక్టర్ కేసలి అప్పారావు అన్నారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కాలేజీ, కెజిబివి పాఠశాల, మినీ గురుకుల ఆశ్రమ పాఠశాలలను మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో మాట్లాడుతూ సమస్యలుంటే నిర్భయంగా తమకు తెలియజేయాలని విద్యార్థులను కోరారు. అలాగే టెన్త్ విద్యార్థులకు పరీక్షల నేపథ్యంలో ఒత్తిడి చేయొద్దని ఉపాధ్యాయులకు సూచించారు. కెజిబివి పాఠశాలలో విద్యార్థుల మెనూ పరిశీలించి ఉపాధ్యాయులకు పలు సూచనలుఅందజేశారు. ఆయన వెంట ఎంఇఒ పి.జోగారావు, సిఆర్‌పిలు, ఐసిడిఎస్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పూర్వపు కమిషనర్‌ను ఎమ్మెల్యే పరామర్శ

పాలకొండ : స్థానిక నగర పంచాయతీ పూర్వపు కమిషనర్, ఎన్జీవో సంఘం డివిజన్ గౌరవాధ్యక్షులు లిల్లీ పుష్పనాథం గత కొన్ని రోజులుగా అనారోగ్యానికి గురై ఆసుపత్రిలో చికిత్స పొంది తిరిగి ఇంటికి రావడంతో స్థానిక ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి మంగళవారం కొండవీధిలో లిల్లీ పుష్పనాథం స్వగృహానికి వెళ్లి పరామర్శించారు. ప్రస్తుతం ఆరోగ్య పరిస్థితి అడిగి తెలుసుకున్నారు. ఎమ్మెల్యేతో పాటు స్థానిక కౌన్సిలర్లు, ప్రజాప్రతినిధులు ఉన్నారు. అలాగే ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్, వైసిపి నాయకులు పాలవలస ధవలేశ్వరరావు పరామర్శించారు.

26న ప్రజ్ఞా వికాస పరీక్ష

కురుపాం : టెన్త్ విద్యార్థులకు ఈ నెల 26న ప్రజ్ఞా వికాస పరీక్ష మండల కేంద్రంలో నిర్వహిస్తున్నట్లు ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి పి.రాజశేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎస్‌ఎఫ్‌ఐ, యుటిఎఫ్ ఆధ్వర్యంలో ప్రజ్ఞా వికాస పరీక్ష నిర్వహించడం జరుగుతుందని, ఈ పరీక్ష రాయడానికి ఆసక్తి గల అభ్యర్థులు 25 రూపాయలు ఫీజు చెల్లించాలన్నారు. ఉదయం 10 గంటల నుంచి 11.30 నిమిషాలు వరకు జరుగుతుందన్నారు. ఈ అవకాశాన్ని టెన్త్ విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఆసక్తి గల అభ్యర్థులు 7671994813, 9441969693 గల నెంబర్లకు సంప్రదించాలని కోరారు.

వ్యాధుల పట్ల అప్రమత్తం

భామిని : దోమల ద్వారా వ్యాప్తించే వ్యాధులైన మలేరియా, డెంగీ పట్ల ప్రజలకు పూర్తి స్థాయిలో అవగాహన కలిగించే బాధ్యత వైద్య సిబ్బందిపై ఉందని శ్రీకాకుళం జిల్లా మలేరియా అసిస్టెంట్ అధికారి బి.శ్రీనివాసరావు తెలిపారు. మండలంలోని సోలికిరి, సతివాడ, అత్తికొత్తూరు, ఘనసారలో డెంగీ పాజిటివ్ కేసులను, బాధితుల ఇళ్లను పరిశీలించారు. దోమలు ద్వారా వ్యాప్తించే వ్యాధుల నివారణకు స్థానిక సిబ్బంది తీసుకుంటున్న చర్యలపై వైద్య సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. దోమ తెరలను ప్రతి ఒక్కరూ వినియోగించాలని సూచించారు. కార్యక్రమంలో మలేరియా సబ్ యూనిట్ అధికారి పి.అప్పారావు, ఎంపిహెచ్ఇఒ జె.పద్మరాజు, హెల్త్ అసిస్టెంట్ జె.లక్ష్యాయ్యి, అమ్మలు, మీనాకుమారి, సత్యవతి, ఆశాలు పాల్గొన్నారు.

అడ్డాపుశిలలో తాగునీటి ట్యాంకు ఏర్పాట్లు

పార్వతీపురంరూరల్ : మండలం అడ్డాపుశిల కాశీవిశ్వేశ్వర దేవాలయంలో భక్తులకు తాగునీటికి ఇబ్బందులు కలగకుండా మోహన్‌సుధీర్ పట్టా అనే ఎన్ఆర్ఐ వితరణతో ఏర్పాటైన రక్షిత తాగునీటి ట్యాంకును మంగళవారం ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ అక్కేన సుందరనాయుడు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భక్తులకు అసౌకర్యం కలగకుండా ఉండేందుకు సుమారు రూ.40 విలువ చేసే స్టీల్‌ట్యాంకుతో పాటు, ఫిల్టర్లు, పైపులైన్లను ఎన్ఆర్ఐ మోహన సుధీర్ పట్టా కల్పించారని తెలిపారు.

డోకిశీలలో ఘనంగా మాతృభాషా దినోత్సవం

పార్వతీపురం రూరల్ : మాతృభాషలో విద్యాబోధన ద్వారా విద్యార్థుల్లో మానసిక పరివర్తన పెంపొందుతుందని మండలం లోని డోకిశిల గిరిజన సంక్షేమ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు గోవింద రావు అన్నారు. మంగళవారం పాఠశాలలో మాతృభాష దినోత్సవ వేడుకలు నిర్వహిం చారు. ఈ సందర్భంగా వాడుక భాష అభి వృద్ధికి బాధ్యుడైన గిడుగు రామ్మూర్తి చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు.

గిడుగుకు నివాళ్లు అర్పిస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

సీతంపేట : మండలంలోని పూతిక వలస బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాలలో తెలుగు భాష దినోత్సవం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు అక్షరాల్లో తెలుగు తీర్చిదిద్దారు. ఎఎంఒ పి.కోటిబాబు తెలుగు ప్రాముఖ్యత గురించి వివరించారు కార్యక్రమంలో హెచ్ఎం శారద, తదితరులు పాల్గొన్నారు

సామాజిక తరగతికి పెద్దపీట

సీతానగరం : వైసిపి ప్రభుత్వం సామాజిక తరగతి పెద్దపేట వేస్తుందని ఎస్సీ కార్పొరేషన్ రాష్ట్ర కమిటీ సభ్యులు సవరపు జయమణి అన్నారు. మండలంలోని పెదబోగిలిలో ఆమె స్వగృహంలో మంగళవారం విలేకరులతో మాట్లాడారు. శాసనమండలికి 18 మంది ఎమ్మెల్సీలను బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలను ఎంపిక చేసిందన్నారు. వైసిపి ప్రభుత్వం అభివృద్ధితో పాటు సామాజిక వర్గానికి కూడా పెద్దపీట వేస్తుందన్నారు. ఈ ఎంపిక పట్ల ఆమె హర్షం వ్యక్తం చేశారు. రాష్ట్ర అభివృద్ధికి, ప్రజలకు సంక్షేమ ఫలాలు అందించేందుకు రానున్న ఎన్నికల్లో వైసిపిని గెలిపించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఆమెతో పాటు వైసిపి నాయకులు ఎస్.రామారావు ఉన్నారు.

నర్సిపురంలో ఫ్యామిలీ డాక్టర్

వీరఘట్టం : మండలంలోని నర్సిపురంలో మంగళవారం 104 ఆధ్వర్యంలో ఫ్యామిలీ డాక్టర్ ఫిజీషియన్ కాన్సెప్ట్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి జి.ప్రదీప్ కుమార్ రక్తపోటు, మధుమేహ, చంటిపిల్లలు, బాలింతలకు, గర్భిణీలకు, తనిఖీలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెచ్‌వి నవోనమ్మ, ఎఎన్ఎం లక్ష్మీ, టెక్నీషియన్ దినేష్, ఆశా కార్యకర్తలు, 104 సిబ్బంది పాల్గొన్నారు.

స్పందన ఫిర్యాదులు పరిష్కరిస్తాం

సీతానగరం : స్పందన కార్యక్రమంలో వచ్చిన ఫిర్యాదులకు పరిష్కరించే దిశగా కృషి చేసేందుకు టీంలు ఏర్పాటు చేస్తామని ఎంపిడిఒ కృష్ణమహేష్ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం అధికారులతో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని శాఖలు సమన్వయంతో పని చేస్తే సమస్యలు పరిష్కారమవుతాయన్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఈ టీములను ఏర్పాటు చేశామన్నారు. సమావేశంలో ఇఒపిఆర్‌డి కెకె వర్మ, డిప్యూటీ తహశీల్దార్ షేక్ ఇబ్రహీం, ఎస్ఐ కె.నీలకంఠం, హౌసింగ్ ఎఇ జానకీరాం, మండల పరిషత్ ఎఒ ఎంఎస్ఎల్ ప్రసాద్, పలుశాఖ అధికారులు పాల్గొన్నారు.

సమగ్ర శిక్ష జిసిడిఒ ఆకస్మిక తనిఖీ

భామిని : స్థానిక కెజిబివి, ఎపి ఆదర్శ పాఠశాలను సమగ్రశిక్ష జిసిడిఒ రోజారమణి మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా పాఠశాలలో విద్యార్థులకు అందుతున్న మెనూ, రికార్డులు, శానిటేషన్, పిల్లల ఆరోగ్యంపై తీసుకుంటున్న జాగ్రత్తలు, పాఠశాల గదుల నిర్వహణ, విద్యా బోధన సంబంధిత అంశాలను పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో మాట్లాడుతూ రాబోయే పబ్లిక్ పరీక్షలు విద్యార్థులు మంచిగా రాయాలని, ప్రణాళిక ప్రకారం సబ్జెక్టులోని వివిధ అంశాలు చదివితే మంచి మార్కులు సంపాదించవచ్చని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో కెజిబివి ఎస్ఒ శారద, మోడల్ స్కూల్ ప్రిన్సిపల్ రఘుపాత్రుని శివకుమార్, ఉపాధ్యాయ సిబ్బంది వున్నారు.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన

సీతంపేట : మండలంలోని కుసిమిలో మంగళవారం రైతు భరోసా కేంద్రం వద్ద ఆర్ఫ్ ఆధ్వర్యంలో ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పించారు.తొలకరి వర్షాల కంటే ముందే పొడి దుక్కుల్లో విత్తనాలు జల్లి పంటల సాగు పద్ధతిని ఆర్ఫ్ సిబ్బంది పి.ధనరాజు వివరించారు. ఈ పద్ధతుల్లో ఐదు జాతుల పంట మొక్కలకు చెందిన 18 రకాల విత్తనాలు వేసుకోవాలని కోరారు. మన నేలలో సేంద్రియ ప్రధాన పంటకు కావాల్సిన పోషకాలు అందుతాయన్నారు. కార్యక్రమంలో సిబ్బంది ఎం.సోనీ, నరేష్ పాల్గొన్నారు.

సిఎం సహాయనిధి చెక్కు పంపిణీ

భామిని : మండలంలోని సోలికిరికి చెందిన కొత్తకోట నవీన్ (31) బ్లడ్ కాన్సర్‌తో గత డిసెంబర్లో మృతి చెందినందున సిఎం సహాయ నిధి నుంచి మంజూరైన రూ.5లక్షలు చెక్కును ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి వండువలోని తన క్యాంపు కార్యాలయంలో నవీన్ తల్లి కొత్తకోట భారతికి మంగళవారం అందజేశారు. కార్యక్రమంలో జెసిఎస్ కోఆర్డినేటర్ కొత్తకోట చంద్రశేఖర్, కాపు కార్పొరేషన్ డైరెక్టర్ మెడిబోయిన చలపతిరావు, వైసిపి సీనియర్ నాయకులు కొత్తకోట ఆంజనేయులు, వలురౌతు చిరంజీవులు, బోడల చిన్నయ్యదొర, రైతుమిత్ర వడ్డీవాడ చిన్నారావు, వాలంటీరు కృష్ణ ఉన్నారు.

ఇళ్ల నిర్మాణాల్లో పురోగతి సాధించాలి

ప్రజాశక్తి - పార్వతీపురం

గృహనిర్మాణ పనుల్లో స్టేజ్ వారీగా పురోగతి సాధించాలని సంయుక్త కలెక్టర్ ఒ.ఆనంద్ తెలిపారు. హౌసింగ్, నాడు-నేడు, గ్రామీణనీటి సరఫరా, నరేగాపనులు, పంచాయతీ, రెవెన్యూ శాఖల ద్వారా అమలవుతున్న ప్రభుత్వ పథకాల లక్ష్యాలచేరువపై మండల అధికారులతో మంగళవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో జెసి మాట్లాడుతూ నిర్దేశించిన లక్ష్యాల మేరకు ఇళ్ల నిర్మాణాలు పూర్తిచేయాలని, స్టేజ్ వారీగా పనులు వేగవంతం చేసే సమయంలోగా గృహనిర్మాణాలు పూర్తిచేయాలన్నారు. అలాగే భూసేకరణ, భూమి చదునుచేయడం, రాళ్ళ పాతడం సంబంధించిన బిల్లుల వివరాలను వెంటనే పంపించాలని తెలిపారు. కొత్త లేఔట్లకు సంబంధించిన నిధుల వివరాలను కూడా తెలియజేయాలన్నారు. రెవెన్యూ శాఖకు సంబంధించి మ్యుటేషన్లు, కరెక్షన్లు పూర్తిచేయాలని తెలిపారు. తహశీల్దార్ స్థాయిలో గల పెండింగును వెంటనే పూర్తిచేయాలన్నారు. ఫీల్డ్ పిఒఎల్ఆర్ పనులు త్వరగా పూర్తిచేయాలని, గ్రామ రెవెన్యూ అధికారులు జమాబంది నిర్వహించి ప్రతి సర్వే నెంబరులో సాగుదారుల వివరాలను నమోదు చేయాలని, రికార్డుల్లో అవసరమైన మార్పులు చేపట్టి సరైన రికార్డు తయారు చేయాలని తెలిపారు. మ్యుటేషన్లకు సంబంధించి కొనుగోలు జరిగిన భూములు, చనిపోయిన వారి భూములు వారసులకు బదలాయింపు, పంపకాలు జరిగిన వివరాలను నమోదు పూర్తి చేయాలని తెలిపారు. భూరికార్డులను సరిచేసి రీసర్వేకు సిద్ధం చేయాలని ఆదేశించారు. మార్కెట్ గోడౌనుల, విలేజ్ హెల్త్ సెంటర్లు, ఎస్.డబ్ల్యు.పి.సి. కేంద్రాల నిర్మాణాలకు కావాల్సిన స్థలసేకరణ పూర్తిచేయాలన్నారు. సమీక్షా సమావేశంలో జెడిఎ పిఎ సి.విష్ణుచరణ్, సబ్ కలెక్టరు నూరుల్ కమర్, ఆర్‌డిఒ కె.హేమలత, డిఇఒ ఎన్వి రమణ, ఆర్‌డబ్ల్యుఎస్ ఇఇ ఒ.ప్రభాకరరావు, హౌసింగ్, డ్వామా పీడీలు పి.రఘురాం, కె.రామ చంద్రరావు, డిపిఒ బలివాడ సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

ముమ్మరంగా పన్నుల వసూళ్లు

పార్వతీపురంటౌన్:2022-23 ఆర్థిక సంవత్సరం ముగుస్తున్న తరుణంలో మున్సిపల్ పరిధిలోని నివాస గృహాల పన్నులు, ఖాళీ స్థలాల పన్నులు, వాణిజ్య సముదాయాల పన్నుల వసూళ్లను మున్సిపల్ కమిషనర్ జె.రామఅప్పలనాయుడు ఆదేశాల మేరకు మున్సిపల్ రెవెన్యూ అధికారులు ముమ్మరం చేస్తున్నారు. ఈ ఏడాది రూ.4 కోట్ల 6 లక్షలు డిమాండ్ కాగా, ఇంత వరకు రూ.2 కోట్ల 88 లక్షలు వసూలు చేశారు. మార్చి నెలాఖరుకు రూ.కోటీ18 లక్షలు వసూలు చేసి శతశాతం పన్ను వసూళ్లను పూర్తి చేసి లక్ష్యాన్ని రెవెన్యూ అధికారులు వెల్లడించారు. ఈ పన్నుల వసూళ్లలో భాగంగా మంగళవారం మున్సిపల్ రెవెన్యూ అధికారి దిబ్బా రుబెన్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ నారాయణరావు, సచివాలయం అడ్మిన్ సెక్రెటరీలు కలిసి రూ.1,48,342 రూపాయలను వసూళ్ల చేశారు.

ఏనుగులు ధ్వంసం చేసిన చెరుకు పంటను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలు

రైతుకు అండగా ప్రభుత్వం

ప్రజాశక్తి - వీరఘట్టం

రైతుకు ప్రభుత్వం అండగా ఉంటుందని, కావున ఎవరూ ఆందోళన చెందొద్దని స్థానిక ఎమ్మెల్యే వి.కళావతి, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ రైతులకు సూచించారు. మంగళవారం మండలంలో ఏనుగుల సంచారం కారణంగా పంట నష్టపోయిన కిమ్మి, నడుకూరు గ్రామాల్లో పంట పొలాలను పరిశీలించారు. అనంతరం వారు మాట్లాడుతూ ఏనుగులు సంచరిస్తున్న విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లామన్నారు. కొద్ది రోజుల్లో ఇక్కడి నుంచి ఏనుగులను తరలించేందుకు చర్యలు చేపడతామని తెలిపారు. ఏనుగులు సంచరిస్తున్నందున రైతులు అప్రమత్తంగా ఉండాలని, రాత్రివేళ పొలాల వైపు వెళ్లొద్దని సూచించారు. అటవీ, పోలీసు, రెవెన్యూ, వ్యవసాయ శాఖ అధికారులు సంయుక్తంగా ఏనుగుల ధ్వంసం చేసిన పంటలను పరిశీలించి పంట నష్ట నివేదికను ప్రభుత్వానికి అందజేయాలని సూచించారు. వీరితో పాటు ఎంపిపి డి.వెంకట రమణనాయుడు, కర్రి లీలాప్రసాదరావు, కిమ్మి సర్పంచ్ జి.రామ్మోహనరావు, పాలకొండ ఎఎంసి ఉపాధ్యక్షులు పి.లక్ష్మణరావు, భోగి లతామాణిక్యం, చంద్రశేఖర్, మాజీ సర్పంచి జి.వెంకటరమణమూర్తి, అటవీ, పోలీసు అధికారులు పాల్గొన్నారు.

రేషన్ అందజేయాలని నిరసన తెలుపుతున్న లబ్ధిదారులు, సిపిఎం నాయకులు

ఫిబ్రవరి రేషన్ మార్చిలో ఇస్తారా?

ప్రజాశక్తి - కొమరాడ

ఈనెల రేషన్ బియ్యం వెంటనే ఇవ్వాలని స్థానిక కొత్త బిసి కాలనీ వద్ద సిపిఎం ఆధ్వర్యాన లబ్ధిదారులతో కలిసి మంగళవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు కొల్లి సాంబమూర్తి మాట్లాడుతూ ప్రతి నెలా 20 లోపు రేషన్ బియ్యం లబ్ధిదారులకు జగనన్న వాహనాల ద్వారా ప్రతి వీధిలోనూ అందించే పరిస్థితి ఉందని అన్నారు. ఈ నెల బియ్యం ఇవ్వలేమని మార్చిలో రెండునెలల బియ్యం ఇస్తామని సంబంధిత డీలర్ చెప్పడం తో లబ్ధిదారులు లబోదిబోమన్న పరిస్థితి ఏర్పడింది. ఈనెల ఎలా గడుస్తుందోనని ఆందోళన చెందుతున్నారన్నారు. ఈనెల బియ్యం ఎందుకు ఇవ్వలేదో అధికారులు తెలపాలని కోరారు. ఈ విషయమై కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామన్నారు. కార్యక్రమంలో రైతు, వ్యవసాయ కార్మిక సంఘాల నాయకులు ఉపేంద్ర, శివున్నాయుడు, తాతబాబు, లక్ష్మమ్మ, పార్వతి, అమ్మడమ్మ, సుజాత, గౌరమ్మ పాల్గొన్నారు.

ఏనుగుల గుంపు సంచారం

వీరఘట్టం : మండలంలోని కిమ్మి నడుకూరు గ్రామ సమీపంలో గత ఐదు రోజులుగా ఏనుగుల గుంపు సంచారం చేయడంతో ప్రజలు భయమందోళనకు గురవుతున్నారు. సోమవారం వాన దామోదర చెరుకు తోటలో బస చేసిన ఏనుగులు గుంపు మంగళవారం వేకువ జామున కిమ్మి గ్రామం వైపు సంచరించి అదే గ్రామానికి చెందిన వాన దామోదర, తాతబాబే రైతులకు సుమారు మూడెకరాల మొక్కజొన్న పంట నాశనం చేసి అక్కడి నుండి మళ్లీ నడుకూరులో దామోదర్ రావు చెరుకుతోటలో బస చేశాయి. చిట్టిపూడివలస వైపు ఏనుగులు గుంపు వస్తాయనుకున్న గ్రామస్తులు గ్రామ వైపు రాకుండా సోమవారం రాత్రి మంటలు వేసినట్లు సమాచారం. నడుకూరుకు చెందిన మజ్జి సత్యనారాయణ కు చెందిన చెరుకు తోట ధ్వంసం చేయడంతో పాటు కొంతమేర మొక్కజొన్న పంట కూడా నాశనం చేసి కొబ్బరి చెట్లను ఇరిసినట్టు రైతు వాపోయాడు.

23న పైడి మారమ్మ వనం గుడి ప్రతిష్ట

కురుపాం : కురుపాంలో వెలిసిన పైడి మారమ్మ తల్లి వనం గుడిని ఈనెల 23న ప్రతిష్ట చేస్తున్నట్టు కళింగ వైశ్య కార్పొరేషన్ డైరెక్టర్ కె.సురేష్ కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 23న హెూమం, 24న అన్న సమారాధన కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. తన సొంత నిధులతో కురుపాం ఇలవేల్పైన గ్రామ దేవత పైడిమాంబ వనం గుడి నిర్మాణం పూర్తి చేసి ప్రతిష్టా కార్యక్రమం చేపట్టినందుకు కురుపాం గ్రామ ప్రజలు, పెద్దలు ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు.

గుండెపోటుతో కాంట్రాక్టు అధ్యాపకుడు మృతి

ప్రజాశక్తి -వీరఘట్టం

స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో కాంట్రాక్టు లెక్చరర్‌గా విధులు నిర్వహిస్తున్న వారాడ ఈశ్వరరావు (49) సోమ వారం అర్ధ రాత్రి పాలకొండలో గుండె పోటుతో మృతి చెందారు.

ఈయన వీరఘట్టం మండలం రేగులపాడు. ఈశ్వర్రావు గత 20 ఏళ్లుగా ప్రభుత్వ జూనియర్ కళాశాలలో లెక్చరర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. ఈయనకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. ఈశ్వరరావు మరణ వార్త విన్న ప్రిన్సిపల్ పైల శంకర్రావు, అధ్యాపక సిబ్బంది, విద్యార్థులు దిగ్భ్రాంతికి లోనయ్యారు.

ఎన్నికలు ప్రశాంతంగా జరపాలి : డిఆర్ఒ

పార్వతీపురం: శాసన మండలి ఎన్నికలు ప్రశాంతంగా, సజావుగా జరిగేందుకు కృషి చేయాలని జిల్లా రెవెన్యూ అధికారి జె.వెంకటరావు అన్నారు. మంగళవారం స్థానిక కలెక్టరేట్‌లో పోలింగ్ అధికారులకు శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. పోలింగ్‌కు ముందుగానే పోలింగ్ అధికారులు పోలింగ్ స్టేషన్లను సందర్శించాలన్నారు. పోలింగ్ స్టేషన్లకు వెళ్లే మార్గాలను ముందుగానే నిర్ణయించుకోవాలని తెలిపారు. బ్యాలెట్ బాక్స్, పోలింగ్ సామాగ్రిని పోలింగ్ స్టేషన్స్‌కు తరలించే ముందు ఒకటికి రెండు సార్లు తనిఖీ చేసుకోవాలన్నారు. బూత్ లెవెల్ అధికారులు, ఇతర సిబ్బంది పోలింగ్ స్టేషన్‌లో బాధ్యతారహితంగా ఉంటే వారిపై చర్యలు తీసుకొనేలా పోలింగ్ అధికారులకు ఆదేశాలు జారీ చేస్తామని తెలిపారు. పోలింగ్ సమయంలో ఏవిధమైన అల్లర్లు, అడ్డంకులు జరిగినా వెంటనే అధికారులకు సమాచారం అందించాలని తెలిపారు. కార్యక్రమంలో ఎన్నికల నోడల్ అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

శిక్షణా తరగతుల్లో మాట్లాడుతున్న ఆర్ఐఒ సత్యనారాయణ

అధ్యాపకులకు శిక్షణ

పార్వతీపురం టౌన్: ఈనెల 26నుంచి జరగనున్న ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలకు ఎగ్జామినర్లుగా వ్యవహరించనున్న లెక్చరర్లకు మంగళవారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఓరియంటేషన్ శిక్షణా తరగతులు నిర్వహించారు. పరీక్షా కేంద్రాల్లో విధుల నిర్వహణ, పాటించాల్సిన నియమ నిబంధనలను ఆర్ఐఒ మజ్జి సత్యనారాయణ వివరించారు. శిక్షణా తరగతులనుద్దేశించి డిఇవిఒ డి.మంజుల వీణ, సభ్యులు ఎల్‌విఎన్ జగన్నాథరావు, ఎన్.రామకృష్ణ, హై పవర్ కమిటీ మెంబర్ వై.నాగేశ్వరరావు, కళాశాల ప్రిన్సిపల్ ఆకుల రాజు మాట్లాడారు. శిక్షణా తరగతుల్లో ఫిజిక్స్, కెమిస్ట్రీ, బోటని, జుయాలజిసబ్జెక్టులకు చెందిన లెక్చరర్లు పాల్గొన్నారు. ఈ ఏడాది ఇంటర్ పరీక్షలు పాత జిల్లాల ప్రాతిపదికన జరుగుతాయని ఆర్ఐఒ సత్యనారాయణ తెలిపారు.

పోలమాంబను దర్శించుకున్న బేబి నాయన

ఐదో వారం జాతరకు పోటెత్తిన భక్తులు

ప్రజాశక్తి - మక్కువ

పోలమాంబ అమ్మవారిని ఐదో వారం జాతరకు మంగళవారం పెద్ద సంఖ్యలో భక్తులు విచ్చేసి దర్శించుకున్నారు. దేవాదాయ శాఖ భక్తులకు అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు చేశారు. బొబ్బిలి యువరాజు బేబీ నాయన పోలమాంబ అమ్మవారిని దర్శించుకున్నారు. చదురు గుడి, వనం గుడి వద్ద క్యూలైన్లు భక్తులతో నిండుగా దర్శనమిచ్చారు. వనం గుడి వద్ద వేప చెట్టుకు భక్తులు మొక్కులను తీర్చుకున్నారు.

ఆరోగ్యంపై నిర్లక్ష్యం వద్దు : డిఎంహెచ్ఒ

ప్రజాశక్తి - కొమరాడ

ఆరోగ్యంపై నిర్లక్ష్యం వహించరాదని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి బగాది జగన్నాథ రావు విద్యార్థులకు సూచించారు. మండలం లోని రావాడ రామభద్రపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో గల ఉలిపిరి ప్రభుత్వ గిరిజన సంక్షేమ బాలికల వసతి గృహాన్ని మంగళ వారం ఆయన సందర్శించారు. విద్యార్థినులతో మాట్లాడి అందరి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. భోజన కార్యక్రమంలో ఆహారాన్ని తనిఖీ చేశారు. శుభ్రమైన తాగు నీరు, పౌష్టికాహారం విద్యార్థినులకు అందించాలని ఉపాధ్యాయులకు సూచిం చారు. పిల్లల ఆరోగ్యం పట్ల శ్రద్ధ అవసం`మన్నారు. ఆరోగ్యం బాగుంటే విద్యపై శ్రద్ధ పెట్టగలరని చెప్పారు. పౌష్టిక ఆహారం తీసుకోకపోవడం వల్ల రక్తహీనత వస్తుంద`న్నారు. విద్యార్థినులకు రక్తపరీ క్షలు చేయించిన రికార్డులను తనిఖీ చేశారు. రక్తహీనత ఉన్న వారి వివరాలు పరిశీ లించి ఐరన్ ఫోలిక్ యాసిడ్ మాత్రలు వేసుకుంటున్నదీ లేనిదీ అడిగి తెలుసు కున్నారు. మాస్ డ్రగ్ అడ్మిని స్ట్రేషన్‌లో భాగంగా డిఇసి, అల్బెండజోల్ మాత్రలు వేసుకున్నదీ లేనిదీ అడిగి తెలుసుకు న్నారు. వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటించడం అవసరం అన్నారు. ఆయన వెంట ఆయా వైద్యాధికారులు ఉన్నారు.

విద్యార్థులను ప్రశ్నిస్తున్న డిఎంహెచ్ఒ జగన్నాథరావు

నాణ్యమైన ఆహారం అందించాలి

కొమరాడ : అంగన్వాడీ కేంద్రాల్లో పిల్లలకు నాణ్యతతో కూడిన ఆహారాన్ని అందించాలని ఎంపిడిఒ ఎల్‌వి అప్పారావు అన్నారు. మండలం లోని గంగరేగువలస అంగన్వాడీ కేంద్రాన్ని మంగళవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అంగన్వాడి కేంద్రంలో ఉన్న పలు రికార్డులను పరిశీలిం చారు. అనంతరం అంగన్వాడీ కేంద్రంలో ఉన్న సరుకులకు సంబంధించిన స్టాక్ రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గర్భిణులకు, బాలింతలకు, పిల్లలకు ప్రభుత్వం పౌష్టికాహారాన్ని అందించేం దుకు అన్ని విధాలా చర్యలు చేపడుతుందన్నారు. అనంతరం పక్కనే ఉన్న మండల ప్రాథమిక పాఠశాలలో తనిఖీ చేశారు. పాఠశాలలో విద్యార్థులకు పెట్టే మధ్యాహ్న భోజన పథకం సక్రమంగా ఉండాల న్నారు. పిల్లలకు భోజనం వండే సమయంలో జాగ్రత్తలు పాటించకపోతే ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని, కావున వండే సమయంలో జాగ్రత్తలు పాటించాలని సూచించారు.

వైసిపి దాడి అమానుషం

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

తాడేపల్లి ప్యాలెస్ ఆదేశాలతో రాష్ట్రాన్ని రావణకాష్టగా మారుస్తున్న జగన్‌రెడ్డిని ప్రశ్నిస్తే బిసిలపై దాడులు, వైసిపి గుండాలతో గన్నవరాన్ని మారణ హెూమంగా మార్చి టిడిపి కార్యకర్తలు, నాయకులపై తప్పుడు కేసులు పెట్టడం విచారకరమని టిడిపి కురుపాం నియోజకవర్గ ఇన్చార్జ్ తోయక జగదీశ్వరి అన్నారు. మంగళవారం స్థానిక విలేకరులతో ఆమె మాట్లాడుతూ జగన్మోహన్‌రెడ్డి పాలనలో ఎస్టీ, ఎస్సీ చట్టాన్ని దుర్వినియోగం, గన్నవరం టిడిపి కార్యాలయంపై వంశీ తన అనుచరులతో రౌడీ మూకలతో విచక్షణారహితంగా దాడి చేయించి మరణహోమం సృష్టించడం ఎంతవరకు సమంజసం అని ప్రశ్నించారు. ప్రశ్నించే వారిపై అక్రమ కేసులు పెట్టడం, వేధించడం వంటి చర్యలతో రాజ్యాంగం ఇచ్చిన హక్కులను కూడా వైసిపి కాలరాస్తుందని మండిపడ్డారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి పి.శ్రీనివాసరావు, నాయకులు చిన్నారావు ఉన్నారు.

రాజకీయ నాయకుల విగ్రహాలకు ముసుగులు

ప్రజాశక్తి-పార్వతీపురంరూరల్

శాసన మండలి ఎన్నికల కోడ్ అమలులోకి రావడంతో పార్వతీపురం పట్టణంతో పాటు మండలంలోని పలు గ్రామాల్లో గల రాజకీయ నాయకుల విగ్రహాలకు ముసుగులు వేస్తున్నారు. ఆర్టీసి కూడలిలో ఉన్న వైఎస్సార్ విగ్రహంతో పాటు, పాతబస్టాండ్‌లో ఉన్న ఎన్టీఆర్ విగ్రహానికి గుడ్డలతో పూర్తి కప్పివేయగా, మండలంలోని కృష్ణపల్లిలో ఉన్న విగ్రహాలకు స్థానిక పంచాయతీ కార్యాలయం సిబ్బంది ముసుగులు వేస్తున్నారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ ఆకిబ్ జావేద్ మాట్లాడుతూ ఉత్తరాంధ్ర పట్టభద్రుల, స్థానానికి ఎన్నికల ప్రక్రియ ప్రారంభమైన జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఈచర్యలు చేపడుతున్నట్లు తెలిపారు.

నాయకుల విగ్రహాలకు వేసిన ముసుగులు

నాలుగు తులాల బంగారం చోరీ

పాలకొండ : పట్టణంలో ముదునూరువారి వీధిలో మంగళవారం సినీపక్కీలో చోరీ జరిగి 4 తులాల బంగారం అపహరణకు గురైంది. వడ్డి కమల మెడలో గుర్తుతెలియని వ్యక్తి 4 తులాల బంగారు గొలుసును తెంపుకుని పరారయ్యాడు. కమల ఒంటిరిగా ఉండటాన్ని గమనించి ఇంటిపైన ఇళ్లు ఖాళీగా ఉందని, ఇళ్లు అద్దెకు కావాలని ఇంట్లోకి దూరాడు. వెనుక తమ కుటుంబసభ్యులు వస్తారని, తాను ముందు చూస్తానని చెప్పాడు. తాగడానికి నీరు కావాలని అడిగాడు. నీరు తేవడానికి కమల ఇంట్లోకి వెళ్లగా ఆ వ్యక్తి కూడా ఇంట్లోకి దూరాడు. ఇంట్లోకి ఎందుకు వచ్చావని కమల ప్రశ్నిస్తే దాహం ఎక్కువుగా ఉందని సమాధానం ఇచ్చి ఒక చేతితో నీటిని తీసుకుని మరోచేత్తో మెడలో ఉన్న గొలుసును లాక్కుని బయట నుంచి గెడవేసి పరారయ్యాడు. కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు ఇవ్వడంతో ఎస్ఐ శివప్రసాద్ అక్కడకు చేరుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గిరిజనులకు వైసిపి దగా

ప్రజాశక్తి - సాలూరురూరల్

గిరిజనులను వైసిపి ప్రభుత్వం దగా చేస్తుందని టిడిపి సాలూరు నియోజకవర్గ ఇన్‌ఛార్జి గుమ్మడి సంధ్యారాణి విమర్శించారు. మండలంలోని తోణాం పంచాయతీ పరిధిలో గల మెట్టవలస, ముంగివానివలస, గుడ్డంగివానివలస, బొర్రా మామిడి వలస, కొత్త వలస గ్రామాల్లో ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సంధ్యారాణి ఆమె మాట్లాడుతూ చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు గిరిజనులు పండించిన ప్రతి పంటను కొనుగోలు చేసేవారని, ఇప్పుడు అటువంటి పరిస్థితి ఉందానని ప్రశ్నించారు. కావున రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజలు సుఖ సంతోషాలతో ఉండాలంటే ముఖ్యమంత్రిగా చంద్రబాబు వస్తేనే బాగుపడుతుందని అన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షులు ఎ.పరమేష, అక్యాన తిరుపతి రావు, బూస తవుడు, టి.తిరుపతిరావు, వెంకట రమణ, రామన్నదొర, రజని, కనక లింగేశ్వర రావు పాల్గొన్నారు.

కేసుల దర్యాప్తు వేగవంతం

భామిని : మండలంలోని బత్తిలి పోలీస్ స్టేషన్‌ను మంగళవారం పాలకొండ డిఎస్‌పి జివి కృష్ణారావు పరిశీలించారు. ఈ సందర్భంగా స్టేషన్ రికార్డ్‌లు, ఫైళ్లను పరిశీలించి, కేసులు దర్యాప్తు అంశాలపై సమీక్షించారు. కేసుల దర్యాప్తు వేగవంతం చేయాలని, నాటు సారా అమ్మకాలు, తయారీపై దృష్టి సారించి నిర్మూలించాలని, రోడ్డు ప్రమాదాల నివారణకు జాగ్రత్తలు తీసుకోవాలని, ఎన్‌ఫోర్స్‌మెంట్ పనులు పెంచాలని ఎస్ఐ వై.అమ్మన్నారావుకు సూచించారు. మహిళా పోలీసులు సచివాలయంలో నిరంతరం అందుబాటులో ఉంటారని, కావున క్షేత్ర స్థాయిలో నాటుసారా తయారీ, విక్రయాలు జరగకుండా పరిశీలించాలని మహిళా పోలీసులుకు తెలిపారు. అనంతరం బత్తిలి సెంటర్ వద్ద వాహన తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా వాహన చోదకులు హెల్మెట్ ధరించాలని, డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలని, రోడ్డు రక్షణ విధానాలు అవాలంభించాలని అవగాహన కలిగించారు. కార్యక్రమంలో స్టేషన్ సిబ్బంది, మహిళా పోలీసులు పాల్గొన్నారు.

800 లీటర్ల నాటు సారా స్వాధీనం

ముగ్గురు అరెస్టు • మరో ముగ్గురిపై కేసు నమోదు

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

కాలినడకను తీసుకొస్తున్న 800 లీటర్ల నాటు సారాను స్వాధీనం చేసుకుని ముగ్గుర్ని అరెస్టు చేసి, మరో ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు ఎన్‌ఫోర్స్‌మెంట్ సిఐ ఎల్.ఉపేంద్ర మంగళవారం విలేకరులకు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సోమవారం అర్ధరాత్రి దాటిన తర్వాత కాలినడకన ఒడిషా నుంచి పార్వతీపురం మున్సిపాలిటీ కొత్తవలసకు నాటుసారా రవాణా చేస్తున్నారన్న సమచారం మేరకు స్థానిక సూర్య పీఠం సమీపంలో గల పొలాల్లో ఎన్‌ఫోర్స్‌మెంట్ ఇన్‌స్పెక్టర్ ఆధ్వర్యాన పోలీసులు కాపుకాసి 800 లీటర్ల నాటుసారాను సీజ్ చేశారు. సారాను తరలిస్తున్న జియ్యమ్మవలస మండలం చినమేరంగికి చెందిన, ప్రస్తుతం కొత్తవలసలో నివసిస్తున్న వెలగాడ సాగర్‌ను అదుపులోకి తీసుకొని విచారించారు. ఒడిషాకు చెందిన మెల్లక ముత్యాలు వద్ద కొని పార్వతీపురం, వీరఘట్టం ప్రాంతాలకు చెందిన ఐదుగురు వ్యక్తులకు సరఫరా చేయడానికి ఒడిశా కూలీల ద్వారా కాలినడకన తలిస్తున్నట్లు తెలిపారు. విచారణలో భాగంగా సదురు వ్యక్తితో పాటు మరో ఇద్దర్ని అరెస్ట్ చేశామన్నారు. ఈ కేసుతో సంబంధం ఉన్న మిగతా ముగ్గురు వ్యక్తులను త్వరలో అరెస్ట్ చేస్తామన్నారు. ఈ దాడుల్లో సిబ్బంది పాల్గొన్నారు.